క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదును అందజేస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు

దేవరాపల్లి: బోయిలకింతాడలో తలారి సత్తి బాబు మృతితో అంత్యక్రియల నిమిత్తం వైఎస్సార్ బీమా పథకం నుంచి తక్షణ సాయంగా రూ.10 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆయన భార్య లక్ష్మికి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అన్నం వెంకటరావు, పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సబ్బవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

చెరకు తరలింపులో జాప్యంపై రైతుల నిరసన



కాటా వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న మోహన్‌రావు

కె.కోటపాడు: ఎ.భీమవరం చెరకు కాటా వద్ద నుంచి చెరకును ఎప్పటికప్పుడు తరలించే చర్యలను ఫ్యాక్టరీ యాజమాన్యం తీసుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన లారీల సంఖ్య తక్కువగా ఉండటంతో కాటా వద్ద చెరకు ఎండిపోతుందని వాపోయారు. దీనివల్ల రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. మంగళవారం ఆయన రైతులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులను గుర్తించి వెంటనే లారీల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తర్రా నారాయణరావు, అప్పారావు, మహేష్, గంగు నాయుడు, దుర్గేష్ పాల్గొన్నారు.

1001 కలశాలతో అక్షింతల ఊరేగింపు



కలశాలతో రాముని అక్షింతల ఊరేగింపు

చీడికాడ: సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ ఆధ్వర్యంలో చుక్కపల్లిలో 1001 కలశాలతో సీతారాముల అక్షింతల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో పెద్ద ఎత్తున జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు బాయిశెట్టి వెంకటరమణ, మజ్జి దేవానంద్, సుంకర తిరుమలరావు, సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా వరాహ లక్ష్మీనృసింహస్వామి పారువేట



దేవునిపనుకుపై గొర్రె పిల్లకు పూజలు చేస్తున్న దృశ్యం

చీడికాడ: అర్జునగిరి స్వయంభూ వరాహ లక్ష్మీ నృసింహస్వామి పారువేట కార్యక్రమం మంగళవారం ఘనంగా ముగిసింది. ఏటా కనుమ రోజున సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆలయానికి సమీపంలో దేవుని పనుకు వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం వరుణదేవుని కరుణ కోసం అగ్ని దేవుని వాహనమైన గొర్రె పిల్లకు తోక కోసి విడిచి పెడతారు. ఆ గొర్రె పిల్ల ఏ దిక్కుకు వెళ్తే ఆ దిక్కున ఈ ఏడాదిలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని ప్రతీతి. తోక కోసి విడిచిపెట్టిన గొర్రెను పట్టుకుని పనుకుపైకి తీసుకు వచ్చిన యువకులను ఉలయకాయల దండలతో సత్కరించడంతో పారువేట ముగుస్తుంది. ఈ ఆనవాయితీ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ బి.రమాదేవి, ఎంపీటీసీ అమ్మతల్లినాయుడు, గ్రామ పెద్దలు జె.వి.సత్యనారాయణ, చొక్కాకుల దాలినాయుడు, పి.నూకునాయుడు, అద్దెపల్లి ఈశ్వరరావు, నర్సింహమూర్తి, జాజిమొగ్గల శంకరరావు పాల్గొన్నారు.



చోడవరం: సంక్రాంతి రోజున తోడపెద్దుకు పూజలు చేస్తున్న మహిళలు



మాడుగుల: జంపెనలో ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి..



చోడవరం: కనుమ పండగ సందర్భంగా ముగ్గులు వేస్తున్న మహిళలు



కె.కోటపాడు: మహిళలకు బహుమతులను అందిస్తున్న శివాజీరాజు, డాక్టర్ అచ్చింనాయుడు

పండగ.. ఆనందం నిండుగ

- సందడిగా సంక్రాంతి, కనుమ సంబరాలు
- పలు చోట్ల తీర్థాలు, ముగ్గుల పోటీలు
- అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

వాడవాడలా సంక్రాంతి, కనుమ సంబరాలు అంబరాన్నంటాయి. పల్లె లోగిళ్లలో తెలుగుదనం ఉట్టిపడేలా పిల్లలు, పెద్దలు సంప్రదాయ దుస్తులతో మెరిశారు. కొత్త అల్లుళ్ల బంధువులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. వాకిళ్లలో వేసిన రంగవల్లికలు, ఆకాశంలో ఎగిరిన గాలిపటాలు, డూడూ బసవన్నల విన్యాసాలతో గ్రామాల్లో పండగ శోభ నెలకొంది. పితృదేవతలను, పశువులను సంప్రదాయ బద్ధంగా పూజించారు.



భోగిమంటల వద్ద గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు



విద్యార్థినుల నృత్యాలు



బుచ్చెయ్యపేట: బంగారుమెట్టలో ఎడ్ల బళ్ల పరుగు పందెం

చోడవరం: సంక్రాంతి పండగ సంబరాలతో గ్రామాలన్నీ సందడి చోటు చేసుకున్నాయి. మకర సంక్రాంతి, కనుమ పండగలు సోమ, మంగళవారాల్లో ఎంతో ఆనందంగా భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. చోడవరం పట్టణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అన్ని గ్రామాల్లో తోడపెద్దులకు మహిళలు పూజలు చేశారు. మరో పక్క పెద్ద పండగతోపాటు కనుమ రోజు తీర్థాలు నిర్వహించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి, కేశవ స్వామి ఆలయాల వద్ద తీర్థాల సందర్భంగా రంగుల రాట్నాలు, పంచదార చిలుకలు, నోరూరించే ఖర్జూరం అమ్మకాలతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో సందడిగా జరిగింది. అదేవిధంగా త్రివేణి సంగమంగా భాసిల్లుతున్న ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద తీర్థం ఘనంగా జరిగింది. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. లక్కవరం తీర్థంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని దేవాలయాల వద్ద స్వామి వారికి తోడపెద్దుతో సేవ చేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మాడుగుల: జంపెనలో సంక్రాంతి పర్వదినాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ వలంటీర్లు ఆర్థిక సాయంతో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మదుమంతి వరలక్ష్మికి 3 తులాలు, పరిశం భవ్యశ్రీకి 2 తులాలు, సిరిసాల హైమకు తులం చొప్పున వెండి అందజేశారు. న్యాయనిర్ణేతలుగా గోకేడ అప్పలనాయుడు, సర్పంచ్ నేమాల గురువు నాయుడు వ్యవహరించారు. గ్రామస్తులు మేడిశెట్టి అర్జునరావు, కోన రాము, పరిశం నాయుడు, కందాలం రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా మాడుగుల కోటబయలు వద్ద సోమవారం భారత నిర్మాణ సేన ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

బుచ్చెయ్యపేట/రావికమతం/రోలుగుంట: బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టలో అచ్చమ్మ పేరంటాలు, పొట్టిదొరపాలెంలో రామాలయం తీర్థాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ రెండు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బంగారుమెట్టలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందించారు. కనుమ సందర్భంగా రైతులు తమ జీవనాధారం, ఇష్టదైవాలుగా భావించే పశువులకు పూజలు చేశారు. కొత్తకోట శివాలయంలో ఆలయ చైర్మన్ గుమ్ముడు దొరబాబు దంపతులు పూజించారు. రోలుగుంట మండలం అడ్డసరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తారపు రామానాయుడు, ఇల్లపు గోవింద జ్ఞాపకార్థంగా వారి కుటుంబాల ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో మహిళలకు ముగ్గుల పోటీలతోపాటు కుర్చీలాట నిర్వహించారు. వీటిల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు గ్రామానికి చెందిన పాచిల హనుమంతురావు, రామ అప్పారావు సహకారంతో వైస్ ఎంపీపీ సూర్యనారాయణ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాచిల శ్రీనివాసరావు, ఈశ్వరరావు, సాంబశివ రావు పాల్గొన్నారు.

పైడంపేటలో..

శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పైడంపేటలో ముగ్గుల పోటీలను నిర్వహించిన వైద్యుడు ఆర్.అచ్చింనాయుడును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అభినందించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రొంగలి రమేష్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని బి.ఎస్.పేట, రామన్నపాలెం, రామారాయుడుపాలెం, తాడపాల గ్రామాలతోపాటు పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. వీటికి పిల్లలు, పెద్దలు అధికంగా తరలివెళ్లి ఆనందంగా గడిపారు. చామంతిపురంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, సర్పంచ్ బొడ్డు గోవిందరావు, నర్సీపట్నం దుర్గాదేవి ఆలయ చైర్మన్ వికాస్ సతీష్ దంపతులు బహుమతులను ప్రదానం చేశారు.

గొలుగొండ: మండలంలో మకర సంక్రాంతి, కనుమ పండగలను వైభవంగా జరుపుకున్నారు. పల్లెల్లో ఎటుచూసినా సందడే సందడి. రంగవల్లికలు పల్లెలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. గొలుగొండలో కనుమ సందర్భంగా తీర్థ మహోత్సవం జరిగింది. చిన్నారులు తీర్థంలో సందడి చేశారు. లింగంపేటలో రంగవల్లికల పోటీ నిర్వహించారు. యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



మాడుగుల: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గురువునాయుడు



రోలుగుంట: (ఎ) అడ్డసరంలో ఖోఖో ఆడుతున్న బాలికలు



రావికమతం: కొత్తకోట శివాలయంలో గోపూజ చేస్తున్న ఆలయ చైర్మన్ దొరబాబు దంపతులు



విద్యార్థినుల అష్టావధానం

విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మణికుమారి, సర్పంచ్ సంతోష్, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పసింబిల్లి మంగరాజు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలో మకర సంక్రాంతి పండగ ఘనంగా జరుపుకున్నారు. ఆట పాటలతో సందడి చేసారు. భజనలు, చిన్నారుల కోలాటం, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

లక్ష్మీపురం హైస్కూల్‌లో..

చోడవరం రూరల్: లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సర్పంచ్ ఎస్.ఆదిగణపతినాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భూతనాధు రామారావు, పూర్వ చైర్మన్ ఎస్.వరహాలునాయుడు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు ఈ సంబరంలో పాల్గొన్నారు. భోగి మంటలతో ప్రారంభించిన సంబరాలు విద్యార్థినుల రంగవల్లికలు, నృత్యాలు, అవధానం, స్కిట్లు ప్రదర్శనలతో సందడి చేశారు. ముగ్గుల పోటీలో కర్రి ధనలక్ష్మి, కె.తేజస్విని, మరుపాక కావ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. హెచ్‌ఎం ఎ.వి.జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: కె.జె.పురంలో తోడపెద్దు ఊరేగింపు



నాతవరం: పండగలో చిన్నారుల కోలాటం



హరిదాసు, గంగిరెద్ద వేషధారణ



రంగవల్లికల పోటీలో ప్రథమ స్థానం పొందిన ముగ్గు



మాడుగుల: సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు, గ్రామస్తులు



రోలుగుంటలో ముగ్గులు వేస్తున్న మహిళలు



మాకవరపాలెం: చామంతిపురంలో బహుమతులు అందజేస్తున్న సతీష్ దంపతులు



కె.కోటపాడు: ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

సందడిగా తీర్థాలు..



మాడుగుల రూరల్: కె.జె.పురం పరిదేశమ్మను దర్శించుకున్న విప్ కరణం ధర్మశ్రీ



దేవరాపల్లి: గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



రావికమతం: ఘనంగా సారె ఊరేగింపులో భక్తులు



దేవరాపల్లి తీర్థంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు, డాక్టరు వి.ఎస్. నాయుడు

మాడుగుల రూరల్: సంక్రాంతి నుంచి మహా శివ రాత్రి వరకు గ్రామాల్లో తీర్థాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం కె.జె.పురంలో పరిదేశమ్మ తీర్థం సందర్భంగా అమ్మవారికి చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. వేగి వారి తోడపెద్దు సేవగరిడీ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం ముత్యమాంబ తీర్థం నిర్వహించారు.

రావికమతం: గంపవానిపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఏటా ఇరు పార్టీల నాయకులు విడివిడిగా నిర్వహించే ఈ ఉత్సవం ఈ ఏడాది ఉమ్మడిగా నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి ఒక్కో రకం మిఠాయితో ఘనంగా సారె ఊరేగింపు చేసి గౌరీపరమేశ్వరులకు సమర్పించారు. సర్పంచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవం జరిగింది.

మాడుగుల: సత్యవరంలో రాములవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పెడగుళ్లు, తాళాలతో భజనలు చేశారు. మహిళల కోలాటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలనాటి సంప్రదాయం ప్రకారం తీర్థం నిర్వహించారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

కె.కోటపాడు: గొండుపాలెంలో దండుముత్యాలమ్మ తీర్థాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందేలు నిర్వహిస్తామన్నారు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున పురస్కారాన్ని అందిస్తామన్నారు.

దేవరాపల్లి: తారువ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం మర్లమాంబ తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. దేవరాపల్లిలో అప్పలమ్మ పేరంటాల తీర్థం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, పరవాడ రవి పాల్గొన్నారు.

ఎస్.జి.నగరం నారితల్లమ్మ తీర్థం నేడు

ఎస్.జి.నగరంలో బుధవారం నారితల్లమ్మ తీర్థం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవ గోడపత్రికను సోమవారం తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. జిల్లా స్థాయి ఎడ్ల బండ్లబళ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చిరికి జగన్నాథరావు, చిరికి శ్రీనివాసరావు, వంటాకు శ్రీనివాసరావు, రొంగలి సింహాచలంనాయుడు, చిరికి వెంకటరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీడికాడ: కనుమ సందర్భంగా మంగళవారం శిరిజాం శివారు రామ్‌నగర్ పైడిమాంబ తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు నిర్వహించారు. కె.జె.పురానికి చెందిన కొలిలాడ మోహన్ బళ్లు మొదటి, నాల్గో స్థానాలు కైవసం చేసుకున్నాయి. ద్వితీయ నర్సాపురానికి చెందిన జగధాత్రి బండి, తృతీయ డి.సురవరానికి చెందిన హర్షవర్ధననాయుడు బండి, ఐదో స్థానంలో కె.ఎల్.బి.పట్నానికి చెందిన దండికాసులనాయుడు బండి నిలిచాయి.

ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంపు



పింఛన్, బీమా సొమ్మును అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్ సొమ్మును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3 వేలకు పెంచారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ క్యాంప్ కార్యాలయంలో వెంకటరాజుపురం గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు పింఛన్లను ఆయన చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అదే గ్రామానికి చెందిన లెక్కల పెంటయ్య అకాల మరణం చెందాడు. మృతుడి భార్య లెక్కల ఉమాదేవికి వైఎస్సార్ బీమా నగదు లక్ష రూపాయలను అందజేశారు. వెంకటరాజుపురం సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్, ఉప సర్పంచ్ గర్రెడ్డి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లెక్కల అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ తాడి అప్పారావు పాల్గొన్నారు.

నేడు బైలపూడిలో 'గడపగడపకు'

చీడికాడ: బైలపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం నిర్వహించనున్నట్టు పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిలి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు.



యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

అనకాపల్లి : దేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని, నేటి యువత సంప్రదాయాలను కొనసాగించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. స్థానిక రావుగోపాలరావు రహదారి ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్-2024 ప్రదానోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలుగుభాష గొప్పతనం గురించి ఆయన వివరించారు. యువత బాధ్యతగా ఇష్టపడి పని చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారని ఆయన చెప్పారు. ప్రపంచ దేశాల్లో తెలుగుభాషకు ఎంతో తియ్యదనం ఉందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ కొణతాల రామలింగస్వామి ట్రస్ట్ పేరు మీద నాలుగేళ్లుగా తెలంగాణ, ఏపీ రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన వ్యక్తులకు అవార్డులతో అభినందించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఉపాధ్యాయ రంగంలో చిలుకూరి శ్రీనివాసరావుకు, ఉత్తమ విద్యార్థి రంగంలో విల్లూరి భార్గవ్, వివిధ రంగాల్లో సంఘం సేవకులకు పి.సత్య తిరుపతిరావు పట్నాయక్, రాపర్తి జగదీష్‌కుమార్, మార్గం రాజేష్, సురకాసి రవితేజ, జీరెడ్డి తరుణ్‌కుమార్ అవార్డులో లక్ష్మీప్రసాద్ సత్కరించారు.